## క్లుప్తంగా

### ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు

**కాంగ్రెస్ జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ మహేందర్‌ముదిరాజ్**

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ మత్స్యకార సహకార సంఘం చైర్మన్‌గా మెట్టు సాయికుమార్‌ను ప్రభుత్వం నియమించడంపై కుతుబ్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద చేసిన వ్యాఖ్యలు సరైనవి కాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ బాకారం మహేందర్‌ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎన్కెపల్లి వ్యవసాయ క్షేత్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మత్స్యకార సంఘాల సమైక్య చైర్మన్‌గా పిట్టల రవీందర్‌ముదిరాజ్‌ను నియమించినప్పుడు ఎవరైనా విమర్శలు చేశారా అని సూచించారు. ఆ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్న పాలనను బీఆర్‌ఎస్ నాయకులు ఎందుకు విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు విమర్శలకు దిగుతున్నారన్నారు. ఇలాంటి విమర్శలను మానుకొని కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరిస్తూ అభివృద్ధిలో ముందుకెళ్లాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల ముదిరాజ్ సంఘం నాయకులు భిక్షపతి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యేను కలిసిన మండల నాయకులు



మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో మండల నాయకులు

షాబాద్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని మండల బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. లగచర్ల ఘటనలో పెట్టిన అక్రమ కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చిన నరేందర్‌రెడ్డిని బుధవారం నగరంలోని ఆయన నివాసంలో మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమ్మరి దర్శన్, నాయకులు కాల్వ జగదీశ్‌రెడ్డి, మామిడి సత్యనారాయణ రెడ్డి, మామిడి వెంకట్‌రెడ్డి, కుమ్మరి మహేందర్, తదితరులు ఉన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో ఇటీవల మృతి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త బద్దుల యాదయ్య కుటుంబానికి ఆ పార్టీ గ్రామ నాయకులు బుధవారం లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి హాజరై నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బెంది శ్రీనివాస్ రెడ్డి, సాయి యాదవ్, యాదయ్య, శ్రీనివాస్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

### రెడ్డి సేవా సమితి కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

షాద్‌నగర్: పట్టణంలోని రెడ్డి సేవా భవనంలో బుధవారం షాద్‌నగర్ రెడ్డి యువజన సేవా సమితి నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెడ్డి కులస్తులందరూ ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండుబాయి శ్రీనివాస్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, ఆశన్నగారి మధుకర్‌రెడ్డి, చౌలపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, బసిరెడ్డి అజయ్‌రెడ్డి, యాదిరెడ్డి, మహేందర్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, పబ్బతి మధుసూదన్ రెడ్డి, సతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



షాద్‌నగర్: చిన్నారులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

# కరుణించు.. కరుణామయా

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే క్రైస్తవులు చర్చిలకు చేరుకొని కరుణించు.. కరుణామయా అంటూ భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. పండుగ సందర్భంగా ప్రధాన చర్చిలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. చర్చి ప్రాంగణాల్లో వేసిన శాంతాక్లాజ్(క్రిస్మస్ తాత), పశువుల పాకలో క్రీస్తు జననం వంటి అలంకరణలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, మిత్రులు క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



షాబాద్: పాస్టర్లకు కేక్ తినిపిస్తున్న నాయకుడు ఆంజనేయులు



మొయినాబాద్‌రూరల్: నక్కలపల్లి చర్చిలో కేక్‌కట్ చేస్తున్న పాస్టర్లు, యూత్ కాంగ్రెస్ నాయకుడు నిరంజన్‌గౌడ్



షాబాద్: మరియాపురం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



చేవెళ్ల: దామరగిద్దలో..



కేశంపేట: కేశంపేటలో..



షాబాద్: ఆరోగ్యమాత చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

### మహాజాతర సభను విజయవంతం చేయండి

**ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబయ్య**



మాట్లాడుతున్న అందె బాబయ్య

షాద్‌నగర్: సమాభివృద్ధికి పాటుపాడిన మహనీయుడు కిషన్ ముదిరాజ్ అని, ఆయన వర్ధంతి సందర్భంగా నిర్వహించే మహాజాతర సభకు ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అందె బాబయ్య కోరారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ముదిరాజ్ మహాసభ సమావేశానికి ముఖ్య అతిథిగా అందె బాబయ్య హాజరై మాట్లాడుతూ.. కామ్రేడ్ కిషన్ పేదల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారన్నారు. ముఖ్యంగా ముదిరాజ్ సమాజాభివృద్ధికి ఎంతో పాటుపడ్డారన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా రంగాల్లో అనేక మార్పులు తీసుకొచ్చిన ఘనత కిషన్ ముదిరాజ్‌కే దక్కుతుందన్నారు. మెదక్ జిల్లా పోలంపల్లి గ్రామంలో ఈ నెల 26వ తేదీ గురువారం నిర్వహించే ముదిరాజ్ మహాజాతర సభకు ముదిరాజ్ కులస్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానపాటి ప్రదీప్‌కుమార్, నాయకులు అంచ రాములు, భూపాల్, కానుగు అంతయ్య, బాల్‌రాజ్, ఏవీయం శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ వద్దు.. పంచాయతే ముద్దు

- మున్సిపాలిటీ ఏర్పాటుపై ప్రభుత్వం ఆలోచించాలి
- బీఆర్‌ఎస్ మండల నాయకుడు కుమ్మరి రాము

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న మున్సిపాలిటీల ఏర్పాటులో గ్రామాల స్థాయిలో అభిప్రాయాలు సేకరించి నిర్ణయం తీసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకుడు, సర్ధార్ నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కుమ్మరి రాము పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామ పంచాయతీ ఎదుట గల అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎన్కెపల్లి, జీవన్‌గూడ గ్రామస్తులతో కలిసి మున్సిపాలిటీ వద్దు.. గ్రామ పంచాయతీ ముద్దు.. అనే పేరుతో ఆయన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు గాలికి వదిలి 111 జీవోలో ఉన్న మొయినాబాద్ మండలాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన విమర్శించారు. ప్రజల అభిప్రాయం లేకుండానే ఏకాభిప్రాయంగా సూచించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముందుగా 111 జీవోను తొలగించి మున్సిపాలిటీ జోలికి రావాలన్నారు. అభిప్రాయాల సేకరణలో గ్రామాల ప్రజలను ఇబ్బందులు పెట్టొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కుమ్మరి రాము, పెండ్యాల శ్రీనివాస్, సురేశ్, ప్రభాకర్, రమేశ్, మల్లేశ్, రవీందర్, చంద్రబోస్‌గౌడ్, కృష్ణ పాల్గొన్నారు.



ఎన్కెపల్లి గ్రామ పంచాయతీ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

### ఘనంగా అయ్యప్ప పడిపూజ

షాబాద్: అయ్యప్ప నామస్మరణలతో బుధవారం మండల పరిధిలోని చందనవెళ్లి గ్రామంలో ఆధ్యాత్మిక వాతవరణాన్ని సంతరించుకుంది. చందనవెళ్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి మహాపడిపూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సర్ధార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ స్వామివారికి పూజలు చేసి ప్రసాదాలు స్వీకరించారు. పూజ అనంతరం స్వాములకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

# వాజ్‌పేయి సేవలు మరువలేనివి

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య**

షాద్‌నగర్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. బుధవారం పట్టణంలో పార్టీ నాయకులు వాజ్‌పేయి 100వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ చౌరస్తాలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. అనంతరం అందె బాబయ్య మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా వాజ్‌పేయి పని చేశారన్నారు. దేశాభివృద్ధి కోసం అనేక రంగాల్లో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు దేపల్లి అశోక్‌గౌడ్, చెంది మహేందర్‌రెడ్డి, శేరి విష్ణువర్ధన్‌రెడ్డి, మోహన్‌సింగ్, వంశీకృష్ణ, హరిభూషణ్, సుధాకర్, శ్యాంసుందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కాసోజు శివకుమార్, నర్సింహ, రాము, నరేందర్‌రెడ్డి, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

**షాబాద్‌లో..**

షాబాద్: గ్రామీణ సడక్ యోజన, ప్రధాన మంత్రి యోజన పథకాలను తీసుకొచ్చి మారుమూల గ్రామాలకు రోడ్లు, నిరుపేదలకు పక్కా ఇళ్లు కట్టిచ్చిన ఘనత మాజీ ప్రధాని వాజ్‌పేయిదేనని బీజేపీ మండల లధ్యక్షుడు కిరణ్‌కుమార్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పొన్న రాజీవ్‌రెడ్డి, లింగాల మహేందర్, రవిగౌడ్, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.



షాద్‌నగర్: వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకొని బీజేపీ నాయకులు మండల పరిధిలోని అమ్డాపూర్ చౌరస్తాలో గల భాస్కర ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీరామ్‌నగర్ ప్రభాకర్‌రెడ్డి, మోర నర్సింహారెడ్డి, గుండాల గోపాల్‌రెడ్డి, మండల నాయకులు మోర నర్సింహారెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, సుదింద్రా, రాజు, మల్లేశ్, శ్రీరాములు, మాధవరెడ్డి, లక్ష్మీపతిరాయాదవ్, అశోక్‌యాదవ్, రాజిరెడ్డి, మహేందర్, మల్లేశ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**చేవెళ్లలో..**

చేవెళ్ల: మండల కేంద్రంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో వాజ్‌పేయి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, అడెట్ల శ్రీనివాస్, దేవుని శర్వలింగం, అభిలాష్, శ్రీనివాస్, జయసింహారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



చేవెళ్లలో..

# పింఛన్.. ఇంకెప్పుడో?

- పెంపుపై ఊసెత్తని ప్రభుత్వం
- ఎన్నికల్లో హామీ ఇచ్చి చేతులు దులుపుకున్న వైనం
- ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

షాబాద్: అధికారంలోకి వచ్చిన వెంటనే వివిధ వర్గాలకు ఇస్తున్న పింఛన్లు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం గత శాసనసభ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిని ఇప్పటివరకు పింఛన్ల పెంపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఎయిడ్స్, బోధకాల బాధితులు, డయాలసిస్ పేషెంట్లకు నెలకు రూ.2016ల పింఛన్లు ప్రతీ నెలా అందించింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లను రూ.5వేలకు పెంచుతామని హామీనిచ్చింది. దివ్యాంగుల పింఛన్‌ను రూ.6వేలకు చేస్తామని ప్రకటించింది. కానీ అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా వాటి గురించి ప్రభుత్వంలో ఎలాంటి చర్చ జరగలేదు. వరుస ఎన్నికలు రావడంతోనే కొంత ఆలస్యం జరిగిందని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను పెంచాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

**మండలంలో లబ్ధిదారులు..**

షాబాద్ మండలంలో మొత్తం 6,834 మంది పింఛన్లు పొందుతున్నారు. వీరిలో 2,188 మంది వృద్ధాప్య, 2,955 మంది వితంతువులు, 747 మంది దివ్యాంగులు, 119 మంది ఒంటరి మహిళలు ఉన్నారు. వీరంతా పింఛన్‌ను ఎప్పుడు పెంచుతారో అని ఎదురుచూస్తున్నారు.

**నిర్ణయం తీసుకోని ప్రభుత్వం..**

పింఛన్‌ల పెంపుపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గత ఫిబ్రవరిలో జరిగిన శాసనసభ సమావేశాలలో కూడా పింఛన్‌ల పెంపుపై బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు, ప్రతిపాదనలు చేయలేదు. పింఛన్ల పెంపుపై మార్గదర్శకాలు సైతం విడుదల కాకపోవడంతో పెంపు ఇప్పట్లో ఉంటుందా?, లేదా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లను పెంచాలని ప్రతిపక్షాలు, లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.




షాబాద్ మండల పరిషత్ కార్యాలయం

### హామీలు అమలు చేయాలి



కాంగ్రెస్ పార్టీ గత శాసనసభ ఎన్నికల్లో పింఛన్లను పెంచుతామని సభలు, సమావేశాల్లో హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచింది. ఇంకా వాటి పెంపుపై నిర్ణయం తీసుకోకపోవడం దారుణం.

– గంగిడి భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు, హైతాబాద్

### పింఛన్ పెంచాలి



ప్రభుత్వం పింఛన్‌ను ఎప్పుడు పెంచుతుందో అని ఆశగా ఎదురుచూస్తున్నాం. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పింఛన్‌ను పెంచితే కొంత ఆసరాగా ఉంటుంది. ప్రభుత్వం తమ బాధలను అర్థం చేసుకుని త్వరగా పింఛన్ల పెంపుపై నిర్ణయం తీసుకోవాలి.

– రావుల లక్ష్మి, నాగర్‌గూడ

# వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులోని నంబయ్యగుట్టపై గల వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా జరిపించారు. మంజుల మల్లేశ్, అనురాధ పర్వత్‌రెడ్డి దంపతులు కల్యాణంలో పాల్గొని పూజలు చేశారు. కల్యాణం అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎల్గనమోని రవీందర్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, సురేశ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కరుణాకర్, మనోహర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

# కళాశాల నిర్మాణానికి విరాళం



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న అశోక్

షాద్‌నగర్: పట్టణంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి గ్రామానికి చెందిన నందారం అశోక్‌యాదవ్ బుధవారం విరాళం అందజేసి సేవా గుణాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల నిర్మాణం చేపడుతున్న స్థలంలో నందారం అశోక్‌యాదవ్ ఎమ్మెల్యేకు రూ.10లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌ను ఎమ్మెల్యే శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, బాలాజీ, మహేశ్, సంతోష్, నక్కల శ్రీకాంత్‌గౌడ్, శివ, శ్రీరాం, హరీశ్, మహేశ్, నర్సింలు, రమేశ్, చెన్నయ్య, లింగారెడ్డిగూడ అశోక్, నందిగామ శంకర్, భగవాన్ దాస్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.